APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 16 అక్టోబర్ 2026 సంపుటి: 01 సంచిక :140 పేజీలు : 04 వెల: 2-00/-

నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు



బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ

ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ

అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ

ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి మిగతా..2లో

తిరుమలలో స్వల్పంగా పెరిగిన భక్తుల రద్దీ



సర్వదర్శనానికి 27 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు

టోకెన్లు లేనివారికి దర్శనానికి 8 గంటల సమయం

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న 84 వేల మందికి పైగా భక్తులు

నిన్న ఒక్కరోజే రూ.3.33 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

తిరుపతి : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ స్వల్పంగా పెరిగింది. గురువారం ఉదయం నాటికి, సర్వదర్శనం కోసం భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 27 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనం లభించడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం మిగతా..2లో

ఏపీలో రాబోయే 3 గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు..




- ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేసింది.
- రాబోయే 3 గంటల్లో పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని..
- ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

అమరావతి, అక్టోబర్ 15: రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే 3 గంటల్లో పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని చిత్తూరు, పుత్తూరు, సత్యవేడు,

రాష్ట్రపతి ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు ఒక సందేశం

- కృష్ణా తీరాన సరస్ మేళా నిర్వహణ ఏపీకి మరింత శోభ తెచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు.
- ఇది నారీ శక్తి, నవభారత్ శక్తి, వికసిత్ భారత్‌కు పునాదని చెప్పారు.



అమరావతి: మహిళా శక్తిని సమర్థవంతంగా ఉపయోగించుకుంటేనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలోని కృష్ణా తీరాన జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పొల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తల్లిని, చెల్లిని, అక్కను, భార్యను ప్రోత్సహించాలని వారి ఆలోచనలకు విలువ ఇవ్వాలని కలలు నిజం చేసేందుకు సహకరించాలని సూచించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు ఒక సందేశమని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళలకు సంకల్పం ఉంటే ఎలాంటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహిస్తారని ముర్ము నిరూపించారని కొనియాడారు. మారుమూల ప్రాంతంలో పుట్టి ప్రజాసేవలో ఒక్కో మెట్టు ఎక్కారని జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా ధైర్యాన్ని కోల్పోలేదని అన్నారు. మిగతా..2లో


సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం

- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ



అమరావతి : మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, మిగతా..2లో

44ఏళ్ల తర్వాత మహిళల హాకీలో స్వర్ణం సాధించటం చారిత్రాత్మకం'- భారత క్రీడా బృందంతో మోదీ భేటీ




- హాకీలో పురుష, మహిళల జట్లు రెండూ బంగారు పతకాలు సాధించటంపై మోదీ హర్షం వ్యక్తంచేశారు.
- జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడలు దేశానికి అనేక విధాలుగా చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు.

ఢిల్లి : హాకీలో పురుష, మహిళల జట్లు రెండూ బంగారు పతకాలు సాధించటంపై ప్రధానమంత్రి

లక్ష్యం నెరవేరింది నక్సలిజం ముగిసింది

కేంద్ర హోంమంత్రి అమిత్ షా

- ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని అమిత్ షా చెప్పారు.
- ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయని చెప్పారు.



ఢిల్లి : నక్సలిజం బస్తర్ ప్రాంతంలో పూర్తిగా అంతరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ 2026 మార్చి 31 గడువును విధించారని, భద్రతా బలగాల కృషితో ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనకు 25 సంవత్సరాలు మిగతా..2లో

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్.. మహిళల భాగస్వామ్యం కీలకం

- విజయవాడ పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు.
- ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని..
- కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు.



విజయవాడ, అక్టోబర్ 15: పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి అంటే గ్రామాల వికాసమని చెప్పుకొచ్చారు. మహిళల స్టాల్లను సందర్శించే అవకాశం దక్కిందని.. వారి ఉత్సాహం, వారి ముఖాల్లోని చిరునవ్వు చూస్తుంటే మహిళలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. ఒకప్పుడు మహిళలు వెనుకబడి ఉండేవారని.. కేవలం కుటుంబ సంరక్షణకే పరిమితమై, ఆర్థికంగా చిన్న చిన్న అవసరాల కోసం కూడా ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ నేడు మహిళలు సంపూర్ణంగా మిగతా..2లో

కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. పచ్చి దోపిడీ



- రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి మండిపడ్డారు.
- గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..
- కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అంటూ అభివర్ణించారు.

హైదరాబాద్, అక్టోబర్15: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అంటూ అభివర్ణించారు. అనుచరులు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు నిబంధనల ఉల్లంఘనలు అని విమర్శించారు. అర్హతలు లేని వారికి కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ఆరోపించారు.

సీఎం రేవంత్ ఆదేశాల అమలు.. విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

- విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్
- విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు
- విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
- ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక



హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి మిగతా..2లో

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్
- ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

ఏపీలో రాబోయే 3 గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు..

శ్రీసిటీ, తడ పరిసర ప్రాంతాలలో పిడుగులతో కూడిన మోస్తారు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దానితో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు చెదురుమదురుగా కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజలు, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేసింది.

తిరుమలలో స్వల్పంగా పెరిగిన భక్తుల రద్దీ

కలగకుండా నిరంతరాయంగా అన్నప్రసాదం, పాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద తోపులాటలు జరగకుండా భద్రతా సిబ్బందిని నియమించి, రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు. మరోవైపు, బుధవారం రోజున మొత్తం 84,289 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 31,474 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హుండీ ద్వారా స్వామివారికి రూ.3.33 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

44ఏళ్ల తర్వాత మహిళల హాకీలో స్వర్ణం సాధించటం చారిత్రాత్మకం'- భారత క్రీడా బృందంతో మోదీ భేటీ

నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యంగా మహిళల హాకీ జట్టు ఏకంగా 44ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించటం చారిత్రాత్మకమని అన్నారు. జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో పాల్గొన్న భారత క్రీడాబృందంతో సమావేశమైన ప్రధాని మోదీ, ఈ క్రీడలు దేశానికి అనేక విధాలుగా చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ స్టేడియంలో ఏషియన్ గేమ్స్ పతక విజేతలను కలిసి అభినందించారు. ఈ సమావేశంలో స్వర్ణ పతకాలు సాధించిన పురుషుల, మహిళల క్రికెట్ జట్లతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. 17 ఏళ్ల సంచలన ఆర్చర్ కుంకుమ్ మోహోడ్ ప్రధానికి ఒక విల్లును బహుమతిగా ఇవ్వగా, మిగిలిన క్రీడాకారులు సంతకాలు చేసిన జెర్సీలను మెమొరాబిలియాగా అందించారు.

విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. పచ్చి దోపిడీ: కల్వకుంట్ల కవిత

ప్రజలకు, వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఆగడాలు ఏమిటని ప్రభుత్వాన్ని ఆమె సూటిగా ప్రశ్నించారు. కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడేవారిని వదిలిపెట్టబోమని కవిత హెచ్చరించారు. తెలంగాణలోనూ మహిళా రైతుల సాధికారత చట్టం తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రైతులకు, రైతు కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా రైతులకు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత తదితర ప్రయోజనాలు అందించాలని రేవంత్ ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు.

నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

గులాబీ రేకులతో దేశంలో మొట్టమొదటి 'రోజ్ వైన్' తయారీ- విమర్శలు, అవమానాలు ఎదురొడ్డి నిలిచిన తల్లీకూతుళ్లు

సవాళ్లు, విమర్శలు అన్నింటినీ తట్టుకుని పుణెకు చెందిన తల్లీకూతుళ్లు వ్యాపారంలో అదరగొట్టారు.
గులాబీ రేకులతో రోజ్ వైన్‌ను తయారుచేసి ప్రశంసలు అందుకున్నారు.

ప్రస్తుత కాలంలో పురుషుల కంటే మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదు. అంతరిక్ష రంగం నుంచి శాస్త్ర సాంకేతిక రంగం వరకు అన్నింట్లోనూ మగవాళ్లతో మహిళలు పోటీ పడుతున్నారు. అయితే మహారాష్ట్రలోని పుణెకు చెందిన తల్లీకూతుళ్లు ఇదే విషయాన్ని రుజువు చేసి చూపించారు. దేశంలో మొట్టమొదటి 'రోజ్ వైన్' (గులాబీ రేకులతో చేసిన వైన్) తయారుచేసి రికార్డు సృష్టించారు. అయితే ఈ విజయం వారికి అంత ఈజీగా రాలేదు. అందుకోసం ఏకంగా 12 ఏళ్ల పాటు శ్రమించారు. ఈ క్రమంలో తల్లీకూతుళ్ల విజయగాథపై 'ఈటీవీ భారత్' స్పెషల్ స్టోరీలో తెలుసుకుందాం పదండి.

300 బాటిల్స్ తయారీ

సాధారణంగా గులాబీ రేకులతో రోజ్ వాటర్, రోజ్ సిరప్ వంటి ఉత్పత్తులను తయారుచేస్తుంటారు. అయితే పుణెలోని కోత్రూడ్‌కు చెందిన జయశ్రీ యాదవ్, ఆమె కుమార్తె కశ్మీరా యాదవ్ మాత్రం గులాబీలతో వైన్ తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కలను నిజం చేసేందుకు సామాజిక వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. దాదాపుగా 12 ఏళ్ల పాటు పరిశోధనలు చేశారు. ఆ సమయంలో తీవ్ర కష్టాలు, విమర్శలు, అవమానాలు పడ్డారు. ఆఖరికి గులాబీ రేకుల నుంచి వైన్‌ను విజయవంతంగా తయారు చేశారు. ఆ ప్రొడక్ట్‌కు ప్రభుత్వం నుంచి పేటెంట్ కూడా లభించింది. వీరి రోజ్ వైన్ బ్రాండ్ పేరు 'రోజ్‌లైన్'.

2008లోనే రోజ్ వైన్ గురించి ఆలోచన వచ్చింది : జయశ్రీ యాదవ్

తాను గత 26 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉన్నానని జయశ్రీ యాదవ్ తెలిపారు. తన ప్రయాణం గుల్కంద్ (గులాబీ రేకుల మిశ్రమం), రోజ్ వాటర్, రోజ్ సిరప్, వెటివర్ (వట్టివేరు) సిరప్, ఉసిరికాయ క్యాండీల వంటి ఉత్పత్తులతో మొదలైందని వివరించారు. ఈ బిజినెస్ ద్వారా తనకు గులాబీ పువ్వుల సువాసన, వాటిలోని వివిధ ఉపయోగాలు తనకు బాగా అర్థమయ్యాయని చెప్పారు. 2008లో గులాబీలతో వైన్ తయారు చేయాలనే ఆలోచన తనకు వచ్చిందన్నారు. ఆ తర్వాత పరిశోధనలు, నిరంతర ప్రయోగాలు మొదలుపెట్టానని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రభుత్వ అనుమతులు పొందే ప్రక్రియను కూడా ప్రారంభించానని వెల్లడించారు. అయితే గులాబీ పువ్వుల నుంచి వైన్ తయారు చేయడానికి అవసరమైన సంక్లిష్టమైన నిబంధనలు, లైసెన్సింగ్ ప్రక్రియలు పెద్ద అడ్డంకులుగా మారాయని స్పష్టం చేశారు. "ఈ కొత్త ఉత్పత్తి కోసం పాలనాపరమైన అడ్డంకులను తొలగించుకోవడానికి మాకు చాలా ఏళ్లు పట్టింది. 2020లో మా రోజ్ వైన్‌కు భారతీయ పేటెంట్ లభించింది. ఆపై 2023లో అధికారిక ఉత్పత్తి లైసెన్స్‌ను పొందాను. ఈ కాలంలో మేము ఆర్థిక ఇబ్బందులే కాకుండా, సామాజిక వ్యతిరేకతను కూడా ఎదుర్కొన్నాం. చాలామంది ఈ ప్రయోగాన్ని వదిలేయమని సలహా ఇచ్చారు. ఒక మహిళ కొత్త రంగంలోకి అడుగుపెట్టి, తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఎంతటి పోరాటం చేయాలో అంతా నేను చేశాను. ఈ ప్రయాణంలో నా కుమార్తె కశ్మీరా యాదవ్ నాకు ఎంతో అండగా నిలిచింది. ఆమె వైన్ తయారీ సాంకేతికతను నేర్చుకోవడానికి ఆస్ట్రేలియా కూడా వెళ్లింది. మేము సొంతంగా భూమిని కొనుగోలు చేసి అక్కడే గులాబీ మొక్కలను పెంచాం. ఇప్పుడు ఆ గులాబీలతోనే 300 వైన్ బాటిళ్లను తయారుచేశాం." అని జయశ్రీ యాదవ్ పేర్కొన్నారు.


ప్రత్యేక శిక్షణ కోసం ఆస్ట్రేలియా వెళ్లాను : కశ్మీరా యాదవ్

తన తల్లి జయశ్రీ యాదవ్ చేస్తున్న వ్యాపారాన్ని చూస్తూ తాను పెరిగానని అన్నారు కశ్మీరా యాదవ్. "గులాబీ రేకుల నుంచి వైన్ తయారు చేయాలనే ఆలోచనను నా తల్లి చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత నేను ఆ ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నాను. ప్రారంభంలో మేము ప్రభుత్వ అనుమతులు పొందడం, పేటెంట్లు దక్కించుకోవడంతో సహా అనేక అడ్డంకులను ఎదుర్కొన్నాం. ఈ పోరాటానికి 8- 10 సంవత్సరాలు పట్టింది. అత్యుత్తమ నాణ్యత గల రోజ్ వైన్‌ను తయారుచేసే కళలో నైపుణ్యం సాధించడానికి

రాష్ట్రపతి ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు ఒక సందేశం

మొదటి పేజీ తరువాయి

ఇది నారీ శక్తి, నవభారత్ శక్తి, వికసిత్ భారత్‌కు పునాది అని తెలిపారు. కృష్ణా తీరాన సరస్ మేళా నిర్వహణ ఏపీకి మరింత శోభ తెచ్చిందని పేర్కొన్నారు. ఇది కేవలం మేళా కాదని 365 రోజులూ మార్కెట్ ఏర్పాటుకు అవకాశమని చెప్పారు. గ్రామీణ మహిళల ఆదాయం పెంచడం, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ఈ మేళా లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. "మహిళలను శక్తి స్వరూపులుగా చూసే పుణ్యభూమి మనదేశం. మహిళలు లబ్ధిదారులు మాత్రమే కాదు సంపద సృష్టికర్తలుగా చూస్తున్నాం. 6 కోట్ల మంది లఖ్‌పతి దీదీలను చేయాలనే కేంద్ర ఆశయం సాధ్యమవుతుంది. డ్వాక్రా సంఘాల వద్ద రూ.28 వేల కోట్ల కార్పస్ ఉంది. ప్రస్తుతం రూ.లక్ష కోట్ల టర్నోవర్ రూ.10 లక్షల కోట్ల స్థాయికి చేరాలి. త్వరలో 10 లక్షల మంది ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా చూడబోతున్నాం. కొత్త



వ్యాపారాలకు అవకాశాలు సృష్టించాలి. నిన్నటి పొదుపు సంఘాలు నేటి వ్యాపార సంస్థలు రేపటి అంతర్జాతీయ బ్రాండ్లు కావాలి."- చంద్రబాబు ముఖ్యమంత్రి ఏపీ శక్తి, భక్తి, సంప్రదాయాలకు ప్రతిరూపం : మహిళా సాధికారతకు ప్రధాని మోదీ అహర్నిశలు శ్రమిస్తున్నారని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను లఖ్‌పతి దీదీలుగా మార్చడమే కాకుండా కరోడ్‌పతీలుగా అభివృద్ధి చేయడమే ప్రధాని లక్ష్యమన్నారు. ఇప్పటికే 3 కోట్ల మందిని లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దామన్న కేంద్రమంత్రి 6 కోట్ల లఖ్‌పతి దీదీలను తయారు చేయడమే సంకల్పమని చెప్పారు. ఇకపై ప్రతి రాష్ట్రంలోనూ సరస్ మేళాను నిర్వహిస్తామని ఇందుకు విజయవాడను ప్రయోగశాలగా మారుస్తామన్నారు. మోదీ సంకల్పానికి సరస్ మేళా ప్రతిరూపం : ప్రధాని మోదీ నినాదం వోకల్ ఫర్ లోకల్‌కు విజయవాడ జాతీయ సరస్ మేళా నిదర్శనమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దేశ నలుమూలల నుంచి 1500 మంది మహిళలు ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారని ఈ వేదిక నారీశక్తికి ప్రతిరూపమన్నారు. మహిళలు కేవలం మార్కెట్‌కు వెళ్లే వారిగా కాకుండా మార్కెట్‌ను సృష్టించేవారిగా ఎదగాలన్నదే లక్ష్యమన్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి ధర రావాలని మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి



ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్.. మహిళల భాగస్వామ్యం కీలకం

మొదటి పేజీ తరువాయి

స్వయం సమృద్ధి సాధించారన్నారు.

ఇతరులకు ఆసరాగా మహిళలు

మహిళలు కేవలం స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, ఇతరులకు కూడా ఆసరాగా నిలుస్తున్నారని ముర్ము తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన, మహిళల సంకల్పం దేశంలోని ముఖ్యమంత్రులందరి ఉమ్మడి కృషి ఫలితంగా మహిళా సాధికారత ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. 2047 కంటే ముందే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు.

మహిళల భాగస్వామ్యం పెరిగింది

వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమైనదని రాష్ట్రపతి వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సాంకేతిక సామాజిక సాధికారత దిశగా కొత్త మార్గం లభించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల



సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, కుటుంబంలో ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ మహిళల భాగస్వామ్యం పెరిగిందన్నారు. భారతదేశం భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, వేర్వేరు సంప్రదాయాలు కలిగిన దేశమైనప్పటికీ అంతా ఒక్కటే అని అన్నారు.

గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ప్రాధాన్యం

ప్రస్తుత గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది మహిళలు రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారని ద్రౌపది ముర్ము అన్నారు. ఒకప్పుడు బ్యాంకుల వద్దకు వెళ్లడానికి సంకోచించిన మహిళలు, నేడు ఎవరి సాయం లేకుండా స్వయంగా బ్యాంకులకు వెళ్లి తమ పనులను స్వతంత్రంగా చక్కబెట్టుకుంటున్నారని తెలిపారు. అంత్యోదయ సమగ్ర దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలే గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వాన్ని అందిస్తున్నారని చెప్పారు. భారత ప్రభుత్వం లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా సాధికారతకు ఒక ప్రత్యేకమైన వేగం, దిశానిర్దేశం అందించిందన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు..

డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ, వారికి నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ముర్ము అన్నారు. గవర్నర్‌గా ఉన్న సమయంలో అక్కడి గ్రామీణ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఆ మహిళలు ల్యాప్‌టాప్‌లను ఉపయోగిస్తూ ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభం పొందుతున్నారు, భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి అనే వివరాలను స్వయంగా ల్యాప్‌టాప్‌లలో నమోదు చేసుకుంటూ పనులు చేసుకునేవారని తెలిపారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కుటుంబంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.


లక్ష్యం నెరవేరింది- నక్సలిజం ముగిసింది

మొదటి పేజీ తరువాయి

పూర్తయిన సందర్భంగా నిర్వహించిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా, దివ్యాంగులు, నక్సల్ బాధితులకు సాయం అందించే కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా పాల్గొన్నారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదని ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని చెప్పారు. ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయని షా చెప్పారు. నక్సలిజంలో మిగిలిన ఆనవాళ్లను కూడా పూర్తిగా తుడిచిపెట్టి, బస్తర్‌ను ప్రశాంతమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చడానికి కేంద్రం పట్టుదలతో ఉందన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఛత్తీస్‌గఢ్‌లో దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ కనీసం ప్రాథమిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. కానీ, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మాత్రం మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. హింసాత్మక ప్రాంతాల్లో సాధారణ స్థితి, గిరిజన సంస్కృతిని పునరుద్ధరించడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కలిసి కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్ షా వివరించారు. "ఐదు దశాబ్దాల పాటు నక్సలిజం ఎంతటి విధ్వంసాన్ని సృష్టించిందో, బస్తర్‌లోని పేద ఆదివాసులను ఏ స్థాయిలో నష్టపరిచిందో ప్రపంచం మొత్తం ఈ గణాంకాల ద్వారా తెలుసుకోగలదు. ఏదైనా ఒక నిర్దోషి అయిన పౌరుడిని, వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఐఈడీ బాంబులు అమర్చి వారి చేతులు, కాళ్లు విసిరేస్తే అంతకంటే పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన మరొకటి ఉండదు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఒక దృఢ సంకల్పం ఉంది. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని చెప్పాం. అనుకున్నట్లుగానే ఈ రోజు దేశంలో నక్సలిజం అంతమైపోయిందని చెప్పడానికి నాకు ఎంతో ఆనందంగా ఉంది. నక్సలిజం వల్ల గత ఐదు దశాబ్దాలుగా ఆ ప్రజలు పడిన వేదనను మనం అంతం చేయలేం. ఆ బాధలు ఎవరినైతే గాయపరిచాయో, వారికి మనం ఓదార్పునివ్వాలి. వారిని నిలబెట్టేందుకు ప్రయత్నం చేయాలి. వారు ఆత్మగౌరవంతో జీవించేలా తగిన ఏర్పాట్లు చేయాలి."

- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి

వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్యఉద్దేశం 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమం ద్వారా దాదాపు 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్ షా పేర్కొన్నారు. అక్టోబర్ 5 నుంచి 7 వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఒక్క బస్తర్



లోనే 1,570 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నక్సలిజం కారణంగా అంగవైకల్యానికి గురైన గిరిజనులకు కృత్రిమ అవయవాలు అందిస్తుండటం పట్ల షా సంతృప్తి వ్యక్తం చేశారు. నక్సలిజం ఐదు దశాబ్దాల పాటు ఛత్తీస్‌గఢ్ ను ఎంతగా పీడించిందో అక్కడి వికలాంగుల సంఖ్యను బట్టి అంచనా వేయవచ్చునని షా పేర్కొన్నారు. నక్సలిజం వల్ల జీవితాలు ప్రభావితమైన వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నొక్కి చెప్పారు. ఒకప్పుడు ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి నక్సలిజం పెద్ద అడ్డంకిగా ఉండేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి పేర్కొన్నారు. అయితే, ప్రధాని మోదీ నాయకత్వంలో నక్సలిజం నిర్మూలన దిశగా తీసుకుంటున్న చర్యలు రాష్ట్రానికి దక్కిన గొప్ప ప్రయోజనాల్లో ఒకటని అన్నారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు.

గులాబీ రేకులతో దేశంలో మొట్టమొదటి 'రోజ్ వైన్' తయారీ- విమర్శలు, అవమానాలు ఎదురొడ్డి నిలిచిన తల్లీకూతుళ్లు

సవాళ్లు, విమర్శలు అన్నింటినీ తట్టుకుని పుణెకు చెందిన తల్లీకూతుళ్లు వ్యాపారంలో అదరగొట్టారు.

గులాబీ రేకులతో రోజ్ వైన్‌ను తయారుచేసి ప్రశంసలు అందుకున్నారు.

ప్రస్తుత కాలంలో పురుషుల కంటే మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదు. అంతరిక్ష రంగం నుంచి శాస్త్ర సాంకేతిక రంగం వరకు అన్నింట్లోనూ మగవాళ్లతో మహిళలు పోటీ పడుతున్నారు. అయితే మహారాష్ట్రలోని పుణెకు చెందిన తల్లీకూతుళ్లు ఇదే విషయాన్ని రుజువు చేసి చూపించారు. దేశంలో మొట్టమొదటి 'రోజ్ వైన్' (గులాబీ రేకులతో చేసిన వైన్) తయారుచేసి రికార్డు సృష్టించారు. అయితే ఈ విజయం వారికి అంత ఈజీగా రాలేదు. అందుకోసం ఏకంగా 12 ఏళ్ల పాటు శ్రమించారు. ఈ క్రమంలో తల్లీకూతుళ్ల విజయగాథపై 'ఈటీవీ భారత్' స్పెషల్ స్టోరీలో తెలుసుకుందాం పదండి.

300 బాటిల్స్ తయారీ

సాధారణంగా గులాబీ రేకులతో రోజ్ వాటర్, రోజ్ సిరప్ వంటి ఉత్పత్తులను తయారుచేస్తుంటారు. అయితే పుణెలోని కోత్రూడ్‌కు చెందిన జయశ్రీ యాదవ్, ఆమె కుమార్తె కశ్మీరా యాదవ్ మాత్రం గులాబీలతో వైన్ తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కలను నిజం చేసేందుకు సామాజిక వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. దాదాపుగా 12 ఏళ్ల పాటు పరిశోధనలు చేశారు. ఆ సమయంలో తీవ్ర కష్టాలు, విమర్శలు, అవమానాలు పడ్డారు. ఆఖరికి గులాబీ రేకుల నుంచి వైన్‌ను విజయవంతంగా తయారు చేశారు. ఆ ప్రొడక్ట్‌కు ప్రభుత్వం నుంచి పేటెంట్ కూడా లభించింది. వీరి రోజ్ వైన్ బ్రాండ్ పేరు 'రోజ్‌లైన్'.

2008లోనే రోజ్ వైన్ గురించి ఆలోచన వచ్చింది : జయశ్రీ యాదవ్

తాను గత 26 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉన్నానని జయశ్రీ యాదవ్ తెలిపారు. తన ప్రయాణం గుల్కంద్ (గులాబీ రేకుల మిశ్రమం), రోజ్ వాటర్, రోజ్ సిరప్, వెటివర్ (వట్టివేరు) సిరప్, ఉసిరికాయ క్యాండీల వంటి ఉత్పత్తులతో మొదలైందని వివరించారు. ఈ బిజినెస్ ద్వారా తనకు గులాబీ పువ్వుల సువాసన, వాటిలోని వివిధ ఉపయోగాలు తనకు బాగా అర్థమయ్యాయని చెప్పారు. 2008లో గులాబీలతో వైన్ తయారు చేయాలనే ఆలోచన తనకు వచ్చిందన్నారు. ఆ తర్వాత పరిశోధనలు, నిరంతర ప్రయోగాలు మొదలుపెట్టానని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రభుత్వ అనుమతులు పొందే ప్రక్రియను కూడా ప్రారంభించానని వెల్లడించారు. అయితే గులాబీ పువ్వుల నుంచి వైన్ తయారు చేయడానికి అవసరమైన సంక్లిష్టమైన నిబంధనలు, లైసెన్సింగ్ ప్రక్రియలు పెద్ద అడ్డంకులుగా మారాయని స్పష్టం చేశారు. "ఈ కొత్త ఉత్పత్తి కోసం పాలనాపరమైన అడ్డంకులను తొలగించుకోవడానికి మాకు చాలా ఏళ్లు పట్టింది. 2020లో మా రోజ్ వైన్‌కు భారతీయ పేటెంట్ లభించింది. ఆపై 2023లో అధికారిక ఉత్పత్తి లైసెన్స్‌ను పొందాను. ఈ కాలంలో మేము ఆర్థిక ఇబ్బందులే కాకుండా, సామాజిక వ్యతిరేకతను కూడా ఎదుర్కొన్నాం. చాలామంది ఈ ప్రయోగాన్ని వదిలేయమని సలహా ఇచ్చారు. ఒక మహిళ కొత్త రంగంలోకి అడుగుపెట్టి, తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఎంతటి పోరాటం చేయాలో అంతా నేను చేశాను. ఈ ప్రయాణంలో నా కుమార్తె కశ్మీరా యాదవ్ నాకు ఎంతో అండగా నిలిచింది. ఆమె వైన్ తయారీ సాంకేతికతను నేర్చుకోవడానికి ఆస్ట్రేలియా కూడా వెళ్లింది. మేము సొంతంగా భూమిని కొనుగోలు చేసి అక్కడే గులాబీ మొక్కలను పెంచాం. ఇప్పుడు ఆ గులాబీలతోనే 300 వైన్ బాటిళ్లను తయారుచేశాం." అని జయశ్రీ యాదవ్ పేర్కొన్నారు.

ప్రత్యేక శిక్షణ కోసం ఆస్ట్రేలియా వెళ్లాను : కశ్మీరా యాదవ్

తన తల్లి జయశ్రీ యాదవ్ చేస్తున్న వ్యాపారాన్ని చూస్తూ తాను పెరిగానని అన్నారు కశ్మీరా యాదవ్. "గులాబీ రేకుల నుంచి వైన్ తయారు చేయాలనే ఆలోచనను నా తల్లి చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత నేను ఆ ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నాను. ప్రారంభంలో మేము ప్రభుత్వ అనుమతులు పొందడం, పేటెంట్లు దక్కించుకోవడంతో సహా అనేక అడ్డంకులను ఎదుర్కొన్నాం. ఈ పోరాటానికి 8- 10 సంవత్సరాలు పట్టింది. అత్యుత్తమ నాణ్యత గల రోజ్ వైన్‌ను తయారుచేసే కళలో నైపుణ్యం సాధించడానికి నేను ఆస్ట్రేలియా వెళ్లాను. విస్తృతమైన ప్రయోగాల ద్వారా మేము చివరికి గులాబీల నుంచి వైన్‌ను తయారు చేయడంలో విజయం సాధించాం. ఈ వైన్‌ను ఇటీవలే అంతర్జాతీయ ప్రోవైన్ ప్రదర్శనలో పెట్టాం. గులాబీలలో యాంటీ యాక్సిడెంట్ గుణాలు, ఆహ్లాదకరమైన సువాసన, కొన్ని ఔషధ సమ్మేళనాలు ఉంటాయి. అందుకే ఈ వైన్ సానుకూల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది" అని కశ్మీరా యాదవ్ అభిప్రాయపడ్డారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు

జిల్లాలో 11.35 లక్షల మంది ఓటర్లు.. 467 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు



పుట్టపర్తి, అనంత సూర్య: స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పాక్షికంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్నికల సంసిద్ధత, నిబంధనలు, భద్రతా ఏర్పాట్లను వివరించారు.జిల్లాలో మొత్తం 11,35,917 మంది ఓటర్లు ఉన్నారని, గతంలో స్పెషల్ రివిజన్ కోసం రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రచార పోస్టర్లను తొలగిస్తున్నామన్నారు.సభలు, ప్రచార కార్యక్రమాలకు సంబంధిత ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.నామినేషన్ల సమయంలో అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని, ప్రతిపాదన సమయంలో అభ్యర్థితో పాటు మరొకరు మాత్రమే ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషిద్ధమని, ప్రచార సమయాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఓటర్లకు నగదు లేదా ఇతర ప్రలోభాలు చూపడం, అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రఫీ ఏర్పాటు చేయడంతో పాటు జిల్లా, మున్సిపల్ స్థాయిలో మీడియా పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.జిల్లాలోని 467 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్ల ప్రక్రియను ఆర్డీవోలు, ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నారని, వార్డుల విభజనను పంచాయతీ అధికారులు చేపడుతున్నారని తెలిపారు. పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.ఎన్నికల నిర్వహణలో ప్రజలు, మీడియా సహకరించాలని కలెక్టర్, ఎస్పీ కోరారు.సమావేశంలో డీఆర్వో కొండయ్య, జెడ్పీ సీఈవో వెంకట సుబ్బయ్య, డీఎఫ్‌వో చక్రపాణి పాల్గొన్నారు.

మేయర్ స్థానంతో పాటు అధిక వార్డులను కైవసం చేసుకుంటాం

అనంతపురం, అక్టోబర్ 15 అనంత సూర్య : ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో నగర మేయర్ స్థానంతో పాటు అత్యధిక కార్పొరేటర్ స్థానాలు కైవసం చేసుకుంటామని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని నవోదయ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు లింగన్న విజయ్ కుమార్ విశ్వనాథ్ లతోపాటు పలువురు వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. వారికి వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిపార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెద్ద ఎత్తున టీడీపీ నేతలు వైసీపీలోకి చేరేందుకు ముందుకు



వస్తున్నారన్నారు. నగరంలో కూటమి పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలతో విసిగి పోయి టీడీపీ నుండి ఆ పార్టీ నేతలు బయటకు వస్తున్నారన్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడం, ఒక్క పింఛన్ కూడా రెండున్నరేళ్లలో ఇవ్వకపోవడం, నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తుండటం, సరైన గుర్తింపు ఇవ్వకపోవడం వంటి అనేక అంశాలలో నచ్చని టీడీపీ నేతలు వైసీపీలోకి వచ్చేందుకు



సిద్ధమవుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి, రామ్మూర్తి, లిఖిత, శ్రీలేఖ, రామలింగమ్మ, ఈశ్వరమ్మ, రాములమ్మ, లలిత, ఉమా పుష్ప తదితరులు వైసీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, సీనియర్ నాయకుల లింగాల రమేష్, బెస్త తిరుపాల్, సాకే చిరంజీవి, హుస్సేన్, శ్రీనివాసులు, గుజ్జుల రామంజి, స్టూడియో బాబు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ అభ్యర్థి కోసం కలిసికట్టుగా పనిచేస్తాం

అనంతపురం, అక్టోబర్ 15 అనంత సూర్య : మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ స్థానం ఏ పార్టీ వారికి ఇచ్చినా.. కలిసికట్టుగా పనిచేస్తామని ఎన్నికల పరిశీలకుడు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, నియోజకవర్గ టిడిపి పరిశీలకుడు దేవేంద్రప్ప తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి అర్బన్ టిడిపి కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు ఏరాసు ప్రతాప్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు దేవేంద్రప్ప, అర్బన్ నియోజకవర్గానికి చెందిన టిడిపి ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు. మేయర్ అభ్యర్థి ఎంపికపై కూడా పార్టీ నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకుడు ఏరాసు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థి ఎవరన్నది ఇవాళ రాత్రి లేదా శుక్రవారానికి స్పష్టత వస్తుందని చెప్పారు. ఏ పార్టీ అభ్యర్థికి మేయర్ పదవి వచ్చినా అంతా కలిసికట్టుగా పనిచేస్తామని మేయర్‌తో పాటు 62కు 62 డివిజన్లలోనూ గెలుస్తామన్నారు. గతంలో లాగా అరాచకాలతో ఎన్నికలు జరపమని.. నిష్పక్షపాతంగా ఉంటాయన్నారు. పోలీసులపై కూడా ఎలాంటి ఒత్తిడి ఉండదన్నారు. తాము అన్ని



విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొచ్చామని ఎన్నికల్లో ఇవే అంశాలని ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. వైసిపి ఇప్పటికే ఓటమి భయంతో తమకు రక్షణ కావాలని కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. మూడు పార్టీల నాయకులు కలిసి అభ్యర్థులు ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. మేయర్‌తో పాటు 62 డివిజన్లలో ఎవరెవరు పోటీ చేయాలన్న దానిపై ఇప్పటికే ఒక స్పష్టత వచ్చిందన్నారు. మా మూడు పార్టీలలో ఎవరికి మేయర్ స్థానాన్ని కేటాయించినా అందరం కలిసికట్టుగానే పని చేస్తామన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా అభివృద్ధి చేశాం కాబట్టి.. కచ్చితంగా భారీ విజయం సాధిస్తామన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కంటే నగరంలో మేయర్ స్థానానికి ఈసారి ఎక్కువ మెజారిటీ ఉంటుందన్నారు. గొడ్డలి పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు కూడా లేదన్నారు. గతంలో వారు ఎన్నికలను ఎలా నిర్వహించారో అందరూ చూశారన్నారు. కనీసం ఏజెంట్లు కూడా లేకుండా పోలింగ్ బూత్‌లలో ఓట్లు వేసుకున్నారని ఆరోపించారు. ఈసారి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్రంతో పాటు అనంతపురం నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని.. 25 లక్షల కోట్ల రూపాయలు రాష్ట్రానికి పెట్టుబడులు కూడా వచ్చాయన్నారు. తాము చేసిన అభివృద్ధి అందించిన సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు అడుగుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మరోవైపు జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు మాట్లాడుతూ.. బీజేపీ, జనసేన, టిడిపి పార్టీలు సమిష్టిగా నిర్ణయం తీసుకున్న తర్వాతనే అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్నారు. వందకు వంద శాతం విజయం సాధించే వారికే స్థానాలు ఉంటాయన్నారు. ఎవరికి టికెట్లు వచ్చినా అందరం సమిష్టిగా పని చేస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వం అరాచక పాలన పోవాలన్న ఉద్దేశంతో గత ఎన్నికల్లో 94శాతం స్ట్రైక్ రేటుతో విజయాన్ని అందించారన్నారు. ఈసారి వందకు వందశాతం స్ట్రైక్ రేట్ ఉంటుందన్నారు. అసలు వైసీపీ అనే రాజకీయ పార్టీ ఉండకూడదన్న విధంగా ప్రజల తీర్పు ఉంటుందని పూల నాగరాజు పేర్కొన్నారు.

పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలకు సత్వర పరిష్కారం

రెండు రోజుల్లో 75 పెన్షన్, 111 జీపీఎఫ్ అథరైజేషన్లు జారీ

అనంతపురం, అనంత సూర్య: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే లక్ష్యమని ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్) శాంతి ప్రియ తెలిపారు.అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ గురువారం ముగిసింది.ఈ కార్యక్రమానికి హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్లను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఉద్యోగ విరమణ చేసిన వారి సమస్యలను పరిష్కరించేందుకు ఇలాంటి కార్యక్రమాలు



ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.శాంతి ప్రియ మాట్లాడుతూ, రెండు రోజుల అదాలత్‌లో 75 పెన్షన్ అథరైజేషన్లు, 111 జీపీఎఫ్ అథరైజేషన్లు జారీ చేయడంతో పాటు పెన్షన్, జీపీఎఫ్, సీఎఫ్ఎంఎస్‌కు సంబంధించిన 160 ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ రెసిడ్యువల్ బ్యాలెన్స్‌ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు వివరించారు.పెన్షనర్లు, ఉద్యోగులు ఏజీ కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా జిల్లాలోనే సమస్యలు పరిష్కరించడంపై ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కుశల్ కార్తిక్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఆశ్రిత నౌపాడ, జిల్లా ట్రెజరీ అధికారులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

నవరాత్రుల సందర్భంగా 5 రోజు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారు



యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్(15) : యాడికి శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా 5వ రోజు అన్నపూర్ణాదేవి అలంకరణ ఏర్పాటు ప్రతిరోజు లాగే షోడశోపచారాలన్నీ నిర్వహించి ప్రత్యేకంగా మహిళలచే భక్తి పాటలకు కోలాటమాడుతూ నృత్య ప్రదర్శన కన్నుల పండుగగా నిర్వహించారు సుప్రభాత సేవ పంచామృతాభిషేకం రుద్రాభిషేకం హోమము జపము బ్రాహ్మణ ముత్తైదువుకు ఒడిబియ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు భక్తి శ్రద్ధలతో శాస్త్రోపవేతంగా నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య సంఘ సభ్యులు తెలిపినారు కుంకుమార్చన లలితా సహస్రనామావళి మణిద్వీప వర్ణన రథోత్సవము ఖడ్గమాల చిన్నారులచే నృత్య ప్రదర్శన మహిళలచే కోలాట ప్రదర్శన ఆలయమంతా భక్తి ప్రవర్తలతో నామస్మనాలతో మారము మోగింది ఈ కార్యక్రమం అంతా యాడికి ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం బంగారు బాల పవన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు ఆర్డీవోను కలిసిన బుజ్జిగాల సుంకన్న



యాడికి, అక్టోబర్ 15 అనంత సూర్య : భూ సమస్య పరిష్కారం కోసం గుంతకల్లు ఆర్డీవోను గురువారం బాధితునితోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. తన భూ సమస్య కోసం దీక్ష చేస్తున్న శిబిరం వద్దకు యాడికి తహసిల్దార్ వచ్చి గుంతకల్లు ఆర్డీవోను కలవాలని చెప్పడంతో వారందరూ ఆర్డీవోను కలిసి వారి సమస్య ఆయన ముందుంచ్చారు. బుజ్జిగాల సుంకన్న భూ రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి ఫోన్ ద్వారా జేసీకి, యాడికి తహసిల్దార్‌లతో మాట్లాడారు. భూ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని, ఈ సమస్య పరిష్కారం కోసం స్పెషల్ ఆఫీసర్‌గా డివిజనల్ సర్వేయర్ చంద్రశేఖరరెడ్డిని ఆర్డీవో నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హరి గోపాల్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప మాదిగ, యాడికి మండల ఎంఆర్పీఎస్ ఇంచార్జి ఎంపీ పుల్లయ్య మాదిగ, యాడికి మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షులు పాతకుట్ల బాలు మాదిగ, ఎంఎస్పీ కన్వీనర్ గురప్ప మాదిగ, గుంతకల్లు మండల అధ్యక్షులు మంజునాథ మాదిగ, రాయదుర్గం నియోజవర్గ కన్వీనర్ సవారెప్ప మాదిగ, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు మాదిగ, ప్రధాన కార్యదర్శి జానకి రాముడు మాదిగ, యాడికి మండల ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నరసింహులు మాదిగ, సూర్యుడు మాదిగ, రామాంజనేయులు మాదిగ, చిన్న రాముడు మాదిగ, రామకృష్ణ మాదిగ, లక్ష్మీనారాయణ మాదిగ, బుజ్జిగాళ్ల సుంకన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



ధర్మవరం, అనంత సూర్య: స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, ప్రలోభపెట్టడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ధర్మవరం ప్రాంతంలో డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల అక్రమాలు లేదా బెదిరింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.కార్యక్రమంలో ధర్మవరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల నిరంతర పోరాటానికి ఫలితం..



'అనంత'లో తొలి పింక్ టాయిలెట్‌కు శ్రీకారం - డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు అనిల్ కుమార్ కృషికి గుర్తింపు..

మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం, అక్టోబర్ 15 అనంత సూర్య :

మహిళలకు ప్రత్యేకంగా ప్రజా మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలన్న ఐదేళ్ల సుదీర్ఘ డిమాండ్ ఎట్టకేలకు కార్యరూపం దాల్చే దిశగా అడుగులు పడుతున్నాయి. నిరంతర ఫిర్యాదులు, అధికారులకు వరుస విజ్ఞప్తులు, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలతో ఈ సమస్యను సజీవంగా ఉంచిన డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు జి.అనిల్ కుమార్ పోరాటానికి కీలక ముందడుగు పడింది. అనంతపురంలో మహిళల కోసం ఏర్పాటు చేయనున్న తొలి పింక్ టాయిలెట్‌కు బుధవారం (అక్టోబర్ 14న) భూమి పూజ నిర్వహించడంతో, ఐదేళ్లుగా సాగుతున్న ఆయన ప్రయత్నాలు సాకారమయ్యే దిశగా పయనిస్తు న్నాయి. ఇది కేవలం ఓ నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమం మాత్రమే కాదు. మహిళల గౌరవం, వ్యక్తిగత పరిశుభ్రత, గోప్యత, ప్రజా ప్రదేశాల్లో వారి సౌకర్యం కోసం ఒక పౌరుడు సాగించిన సుదీర్ఘ పోరాటంలో ఇది కీలక మైలురాయి.

ఐదేళ్లుగా అలుపెరగని పోరాటం :

అనంతపురం నగరానికి వివిధ అవసరాల కోసం వచ్చే మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన అనిల్ కుమార్.. మహిళలకు ప్రత్యేకంగా ప్రజా మరుగుదొడ్డి ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను గత ఐదేళ్లుగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఫిర్యాదులు చేయడం, సంబంధిత అధికారులను సంప్రదించడం, పదేపదే గుర్తుచేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యల ద్వారా ఈ అంశంపై నిరంతరంగా తన గళాన్ని వినిపించారు. పని నిమిత్తం, వైద్య సేవల కోసం, కొనుగోళ్ల కోసం, ఇతర అవసరాల కోసం నగరానికి వచ్చే మహిళలకు తగిన ప్రజా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం తీవ్ర అసౌకర్యానికి దారితీస్తోంది. ముఖ్యంగా వృద్ధ మహిళలు, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరా నికి వచ్చే మహిళలు ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్డి అనేది విలాసవంతమైన సౌకర్యం కాదని, అది ప్రాథమిక పౌర అవసరమని అనిల్ కుమార్ తన ప్రచారం ద్వారా పదేపదే స్పష్టం చేశారు. ప్రజా ప్రదేశాల్లో మహిళలు గౌరవంగా, ఇబ్బందులు లేకుండా నంచరించేందుకు ఇటు వంటి సదు పాయాలు అత్యవసర మని ఆయన పేర్కొంటూ వచ్చారు.



2 లక్షల మందికి పైగా మహిళలకు ప్రయోజనం కలిగే అవకాశం :

అనిల్ కుమార్ అంచనా ప్రకా రం.. ప్రతిపాదిత పింక్ టాయి లెట్ ద్వారా అనంతపురం నగరం లో నివసించే, నగరానికి వివిధ అవసరాల కోసం వచ్చే 2 లక్షల మందికి పైగా మహిళలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఈ సదుపాయం కేవలం మరుగుదొడ్డి వినియోగానికే పరిమితం కాకుండా, మహిళలకు అవసరమైన గోప్యత, వ్యక్తిగత పరిశుభ్రత, సౌకర్యాన్ని అందించే లా రూపొందిస్తే మరింత ప్రయో జనకరంగా ఉంటుంది. ముఖ్యం గా చిన్నపిల్లల తల్లులకు బిడ్డలకు పాలివ్వడానికి, పిల్లల దుస్తులు మార్చడానికి ప్రత్యేక స్థలం కల్పిస్తే మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, ఈ లక్ష్యాలు నెర వేరాలంటే నిర్మాణంతో పాటు నిరంతర నిర్వహణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. తగిన నీటి సరఫరా, పరిశుభ్రత, వెలుతురు, భద్రత, దివ్యాంగ మహిళలకు అందుబాటు వంటి అంశాలు కీలకం. అలాగే, తల్లులు తమ పిల్లలకు పాలివ్వడానికి, శిశువుల అవసరాలు తీర్చడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తే ఈ ప్రాజెక్టు మరింత సమగ్రంగా మారుతుంది.

అందరికీ కృతజ్ఞతలు.. వరుణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు :

పింక్ టాయిలెట్ నిర్మాణానికి సంబంధించి భూమిపూజ జరగడంపై అనిల్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ముందుకు సాగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, ఆ దిశగా చర్యలు తీసుకున్న టీసీ వరుణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా రు. అదేవిధంగా ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు, ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ఇతరులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఒక ప్రజా సమస్యపై నిరంతరం పోరాడితే, సంబంధిత అధికారులతో సంప్రదింపులు కొనసాగిస్తే, ప్రజల్లో అవగాహన కల్పిస్తే మార్పు సాధ్య మవుతుందనే విషయానికి ఈ పరిణామం ఉదాహరణగా నిలుస్తోంది.

పునాది రాయి మాత్రమే కాదు..

మహిళల గౌరవానికి ఒక ముందడుగు :

అనంతపురంలో తొలి పింక్ టాయిలెట్‌కు భూమిపూజ జరగడం నగరంలో మహిళలకు అనుకూలమైన మౌలిక సదుపాయాల కల్పన దిశగా కీలక పరిణామం. మహిళలు ప్రజా ప్రదేశాల్లో ఆత్మ గౌరవంతో, సౌకర్యవంతంగా సంచరించేందుకు అవసరమైన సదుపా యాలు కల్పించడం ఒక సమగ్ర నగర అభివృద్ధిలో అంతర్భాగం. డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు అనంతపురం జి.అనిల్ కుమార్ ఐదేళ్లుగా సాగించిన నిరంతర పోరాటానికి ఈరోజు ఒక కీలక మైలు రాయి. అయితే, అసలు విజయం నిర్మాణం పూర్తయిన రోజుతోనే ముగియదు. ఈ సదుపాయం ప్రజలకు అందుబాటులోకి వచ్చి, పరిశు భ్రంగా, సురక్షితంగా, నిరంతరం పనిచేస్తున్నప్పుడే ఈ ప్రయత్నానికి పూర్తి సార్థకత చేకూరుతుంది.

ఐదేళ్ల నిరంతర పోరాటం.. ఎన్నో ఫిర్యాదులు.. అంతులేని ఫాలోఅప్‌లు.. ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు.. చివరకు కార్యరూపం దాల్చుతున్న ఒక ప్రజా అవసరం. అనంతపురం తొలి పింక్ టాయిలెట్‌కు పడిన పునాది రాయి ఒక నిర్మాణానికి ఆరంభం మాత్రమే కాదు.. మహిళల గౌరవం, సౌకర్యం కోసం ఒక పౌరుడు సాగించిన పట్టుదలకు గుర్తుగా నిలిచే మైలురాయి.

మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీని

నిలబెట్టుకున్న టీసీ వరుణ్



ఈ పోరాటంలో కీలక పరిణామంగా, అనంతపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ టీసీ వరుణ్ మూడేళ్ల క్రితం అనిల్ కుమార్‌కు మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్డి ఏర్పాటు చేసే అంశంపై హామీ ఇచ్చారు. తాజాగా అనంతపురంలో తొలి పింక్ టాయిలెట్ కు భూమిపూజ నిర్వహించడంతో ఆ హామీ కార్యరూపం దాల్చే దిశగా అడుగు లు పడ్డాయి. ఏటీపీ అర్బన్ డెవలప్‌మెం ట్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ముందుకు సాగడం, ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న ప్రజా అవసరంపై స్పష్టమైన చర్య ప్రారంభం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలను ఆచరణలోకి తీసుకురావడం ఎంత ముఖ్యమో ఈ పరిణామం మరోసారి గుర్తు చేస్తోంది. ముఖ్యంగా నిరంతర పౌర ప్రయత్నాలకు స్పందించి, ప్రజల అవసరాలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయమైన అంశం.

భూమిపూజకు అనిల్ కుమార్‌కు ఆహ్వానం..

ఐదేళ్ల కృషికి గౌరవం

ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం.. పింక్ టాయిలెట్ కోసం ఐదేళ్లుగా పోరాటం చేస్తున్న అనిల్ కుమార్‌ను భూమిపూజ కార్యక్రమానికి ఆహ్వానించి, పూజా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించడమే. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ కూడా భాగస్వామి అయ్యారు. ప్రజా సమస్యను నిరంతరం అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వ్యక్తిని కార్యక్రమానికి ఆహ్వానించడం ఆయన కృషికి ఇచ్చిన గుర్తింపుగా నిలిచింది. ఐదేళ్లుగా తాను లేవనెత్తుతున్న అంశం ఎట్టకేలకు కార్యరూపం దాల్చే దిశగా ముందుకు సాగుతుండటంతో అనిల్ కుమార్ ముఖంలో కనిపించిన ఆనందం, ఉపశమనం అక్కడి వారిని ఆకట్టుకున్నాయి. ఎన్నో విజ్ఞప్తులు, ఫాలోఅప్‌లు, అవగాహన కార్యక్రమాల అనంతరం ఒక స్పష్టమైన అడుగు పడటంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ప్రశాంతి నిలయంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న

-శ్రీసత్యసాయి బాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు.. వేద యజ్ఞాన్ని వీక్షించిన సినీ తారలు

పుట్టపర్తి, అనంత సూర్య: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరుగుతున్న నవరాత్రి--దసరా వేడుకల సందర్భంగా ప్రముఖ సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న గురువారం సందర్శించారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సన్నిధిలో ప్రణమిల్లి, పవిత్ర భజన మందిరంలో కొంతసేపు గడిపారు. వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞ కార్యక్రమాలను వీక్షించారు.శ్రీసత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్



పూర్వ విద్యార్థి అయిన విజయ్ దేవరకొండ ఈ సందర్భంగా తన విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గతంలో యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొని వేద మంత్రాలను జపించిన అనుభవాలను స్మరించుకున్నారు.రష్మిక మందన్నకు పుట్టపర్తి సందర్శన ఇదే తొలిసారి. భగవాన్ పవిత్ర క్షేత్రాన్ని దర్శించాలన్న తన చిరకాల కోరిక నెరవేరిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.ఆశ్రమంలోని ప్రశాంత వాతావరణం, వేద మంత్రాల నినాదాలు, హారతి తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు.దేశవ్యాప్తంగా తరలివచ్చిన భక్తులతో ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న ఎంపీ అంబికా కుటుంబ సభ్యులు



అనంతపురం, అక్టోబర్ 15 అనంత సూర్య : తిరుమల బ్రహ్మోత్సవాల శు భవేళ కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు పొందారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని స్వామివారిని వేడుకున్నారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, అనంత సూర్య: పుట్టపర్తి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో చైర్మన్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా




జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.మున్సిపాలిటీలోని 1 నుంచి 12వ వార్డులకు సంబంధించిన నామినేషన్లను సాయినగర్ బైపాస్ రోడ్డు సమీపంలోని చినపల్లి హైస్కూల్‌లో, 13 నుంచి 28వ వార్డులకు సంబంధించిన నామినేషన్లను ఎనుములపల్లిలోని బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో స్వీకరించనున్నారు. చైర్మన్ పదవికి సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కూడా ఈ కేంద్రాల్లోనే నిర్వహించనున్నారు.ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు కేటాయించిన కేంద్రాల్లో నిర్ణీత సమ--యంలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు దాఖలు చేయాలని అధికారులు సూచించారు. ఈ పరిశీలనలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-44 విస్తరణతో ప్రయాణం సులభతరం

శ్రీ సత్యసాయి జిల్లాలో 77 కి.మీ. మేర ఆరు లేన్ల రహదారి.. ఇరువైపులా సర్వీస్ రోడ్లు



పుట్టపర్తి, అనంత సూర్య: జాతీయ రహదారి-44 విస్తరణలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 77 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నిర్మించనున్నట్లు కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కర్నూలు నుంచి కోడుకొండ వరకు మొత్తం 243 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ప్రస్తుతం వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ దశలో ఉందన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమా--ర్‌తో కలిసి ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు.హైవే నిర్మాణంతో స్థానిక రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా జిల్లా పరిధిలో రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రాజెక్టులో భాగంగా ఒక ప్రధాన వంతెన, 23 చిన్న వంతెనలు, 22 వాహన అండర్--పాస్‌లు, 11 తేలికపాటి వాహన అండర్‌పాస్‌లు, ఆరు ఫ్లైఓవర్లు, రెండు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు నిర్మించనున్నట్లు తెలిపారు.విద్యుత్ లైన్లు, నీటి పైప్‌లైన్లు, కేబుళ్లతో



పాటు డ్రైనేజీ వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తామన్నారు.ఈ రహదారికి అవసరమైన 60 మీటర్ల వెడల్పు భూమిని 2006--07లోనే సేకరించినందున కొత్తగా భూసేకరణ అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.రహదారి పరిధిలో అక్రమ ఆక్రమణలు గుర్తిస్తే చట్టప్రకారం తొలగిస్తామన్నారు. డీపీఆర్ పూర్తయ్యేందుకు ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం పట్టవచ్చని, అనంతరం టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రహదారి భద్రత, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405